నమస్తే తెలంగాణ
నిజామాబాద్, సోమవారం 23 డిసెంబర్ 2024
MONDAY, DECEMBER 23, 2024

# కేజీబీవీ భవనానికి ప్రహరీ నిర్మాణం ఎప్పుడో?

- ఎనిమిది నెలల క్రితం సొంత భవనంలోకి..
- ప్రహరీ లేక సంచరిస్తున్న పాములు
- భయాందోళన చెందుతున్న విద్యార్థినులు



అశోక్‌ఫారం వద్ద నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనం



పాఠశాల భవన ప్రాంగణంలో పిచ్చిమొక్కలతో ఎత్తుపల్లాలుగా ఉన్న స్థలం

సారంగాపూర్, డిసెంబర్ 22 : కేసీఆర్ ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. పేద విద్యార్థుల కోసం రాష్ట్రంలో గురుకుల పాఠశాలలను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేయడంతోపాటు పెద్ద మొత్తంలో సొంత భవనాలను నిర్మించింది. ఇందులో భాగంగా నిజామాబాద్ రూరల్ మండలానికి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మూడున్నరేండ్ల క్రితం మంజూరు చేసింది. మూడేండ్ల పాటు మోపాల్ మండల కేంద్రంలోని అద్దె భవనంలో తరగతులు కొనసాగేవి. భవనానికి నెలకు రూ.22 వేలు అద్దె చెల్లించేవారు. అద్దె భవనం ఇరుకుగా ఉండడం, సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యాలయ భవన నిర్మాణానికి అప్పటి రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక చొరవ చూపి రూ.3.72 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఆకులకొండూర్ జీపీ పరిధిలోని అశోక్‌ఫారం గ్రామ ప్రధానరోడ్డు పక్కన 2 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిని తాజామాజీ సర్పంచ్ మెట్టు అశోక్ సహకారంతో అధికారులు కేటాయించగా నూతన భవనాన్ని నిర్మించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో తరగతి గదులు, ప్రిన్సిపాల్ కార్యాలయం, వంట శాల, భోజనశాల నిర్మించారు. మొదటి, రెండో అంతస్తులలో విద్యార్థినుల కోసం ఉండేందుకు డార్మెటరీ గదులను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మోపాల్‌లోని అద్దె భవనం నుంచి ఈ కొత్త భవనంలోకి విద్యార్థినులను షిఫ్ట్ చేశారు. ఈ భవనంలో రూరల్ మండల కేజీబీవీకి చెందిన 6–10 తరగతి వరకు సుమారు 300 మంది విద్యార్థులు, నార్త్ మండల కేజీబీవీకి 6, 7 తరగతులకు చెందిన 42 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. కేజీబీవీ ప్రాంగణంలో విశాలమైన స్థలం ఉన్నదని, క్రీడలు ఆడేందుకు మొరంతో చదును చేయాలని విద్యార్థినులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మాణం కోసం అధికారులకు విన్నవించామని, కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు శ్రీవేణి, అశ్విని తెలిపారు. కానీ, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు.

**కేజీబీవీ ప్రాంగణంలో సంచరిస్తున్న పాములు**

ఈ విద్యాలయ భవనానికి ప్రహరీ లేకపోవడం, చుట్టూ పొలాలు ఉడడంతో తరగతి గదుల్లోకి, గ్రౌండ్‌లోకి పాములు, విషపురుగులు వస్తున్నాయి. దీంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, విద్యా శాఖ అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

పొతంగల్, డిసెంబర్ 22 : సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు పొతంగల్ గ్రామానికి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు జడ్పీహెచ్ఎస్ పీడీ ప్రతిభ తెలిపారు. జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో అథ్లెటిక్స్ సైక్లింగ్ ఓపెన్ మెన్ విభాగంలో విలాస్, 400 మీటర్ల పరుగులో అపాన్, కుస్తీ 48 కేజీల విభాగంలో భూశేఖర్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. శనివారం జిల్లా స్థాయి పోటీలు ముగింపు కార్యక్రమంలో భాగంగా బహుమతులు అందుకున్నారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

## ఇంటి నిర్మాణ పనులు చేస్తూ కిందపడి మేస్త్రీ మృతి

వినాయర్‌నగర్, డిసెంబర్ 22 : నిజామాబాద్ మండల పరిధిలోని గూపన్‌పల్లి గ్రామంలో ఓ ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న మేస్త్రీ ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రగాయాల పాలై మృతిచెందాడు. రూరల్ ఎస్సై మహ్మద్ ఆరిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కొనకమిట్ల మండలం గుడ్లగుట్ట గ్రామానికి చెందిన బత్తుల శ్రీను (36) కొంతకాలం క్రితం నిజామాబాద్‌కు వచ్చి ఇక్కడే నివాసం ఉంటూ భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. శుక్రవారం నిర్మాణ పనులు చేస్తుండగా కిందపడి తీవ్ర గాయాలపాలు కాగా.. చికిత్స కోసం ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి

ధర్పల్లి, డిసెంబర్ 22 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ధర్పల్లి ఎస్సై రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## నాలుగు రోజులపాటు టీజీబీ సేవల నిలిపివేత

ఇందల్వాయి, డిసెంబర్ 22 : మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, గన్నారం గ్రామాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ఈనెల 28 నుంచి 31 వరకు నిలిపివేయనున్నట్లు బ్రాంచ్ మేనేజర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం మార్గదర్శకాలననుసరించి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకును వరంగల్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులోకి విలీనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విలీన ప్రక్రియ నేపథ్యంలో మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం, యూపీఐ సేవలు నాలుగు రోజుల పాటు నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఖాతాదారులు బ్యాంకు అవసరాలను ఈనెల 28లోగా వినియోగించుకోవాలని సూచించారు.

## గవర్నమెంట్ ప్లీడర్‌గా సుదర్శన్



సుదర్శన్



ఎర్రం సదానంద్

వినాయక్‌నగర్, డిసెంబర్ 22 : నిజామాబాద్ జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా సీనియర్ న్యాయవాది అమిదాల సుదర్శన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కోర్టు, అదనపు జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానాల్లో జిల్లా అధికార యంత్రాంగం తరపున సుదర్శన్ మూడేండ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. సుదర్శన్ నియామకంపై రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి, బార్ అధ్యక్షుడు జగన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన వారికి సుదర్శన్ కృతజ్ఞతలు తెలిపారు.

**ఏజీపీగా ఎర్రం సదానంద్..**

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఎర్రం సదానంద్‌ను నియమించారు. ఆయన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా కొనసాగనున్నారు.

## వెంకటస్వామికి ఘన నివాళి



వెంకటస్వామి వర్ధంతిలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కంఠేశ్వర్/ వినాయక్‌నగర్, డిసెంబర్ 22 : కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు శనివారం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారికంగా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి చిత్రపటానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ముత్తెన్న, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు నివాళులర్పించారు.

జిల్లాకేంద్రంలోని కమిషనరేట్ కార్యాలయంలో ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధూశర్మ ఆదేశాల మేరకు అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి ఆధ్వర్యంలో వెంకటస్వామి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పోలీసులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీసీఆర్‌బీ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు సతీశ్ కుమార్, ప్రసాద్, ఆర్‌ఐలు, పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు.. నెట్‌వర్క్ ఇబ్బందులు

- నత్తనడకన సర్వే
- ఇప్పటి వరకు 30 శాతమే పూర్తి
- క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్న గ్రామ కార్యదర్శులు



ధర్మారెడ్డిలో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారిణి రత్నం

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 22: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే గ్రామ కార్యదర్శులకు ఇబ్బందులను తెచ్చి పెట్టింది. మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో..నెట్‌వర్క్ ఇబ్బందులతో సర్వే ముందుకు సాగడం లేదని గ్రామ కార్యదర్శులు పేర్కొంటున్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే బాధ్యతలను ఆయా గ్రామాల కార్యదర్శులకు అప్పగించారు. సర్వే ప్రారంభమై చాలా రోజులు కావస్తున్నా మండలంలో ఇప్పటి వరకు 30 శాతం మాత్రమే సర్వే పూర్తి చేశారు. మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా..అందులో 7,764 కుటుంబాలు ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో ఇప్పటి వరకు 2,400 కుటుంబాల వివరాలు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కాగా క్షేత్ర స్థాయిలో గ్రామ కార్యదర్శులు నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గ్రామాలు, తండాల్లో..కుటుంబ సభ్యుల వివరాలు ఎంట్రీ చేసేందుకు సైతం నెట్‌వర్క్ ఇబ్బందులతో ముందుకు వెళ్లడం లేదని, సిగ్నల్ కోసం ఎత్తయిన ప్రాంతాల్లోకి వెళ్లి అప్‌లోడ్ చేయాల్సి వస్తున్నదన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లో ఉండి సర్వే చేపట్టినా 10 మందివి కూడా కావడం లేదనీ..కొన్ని సార్లు అసలు యాప్ సర్వర్ పని చేయకపోడంతో ఖాళీగా ఉండవలసి వస్తున్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇలా ఉంటే అధికారులు సర్వే త్వరగా పూరి చేయాలంటూ చెబుతున్నారనీ, తమ బాధలు ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెలవు దినాల్లో సైతం గ్రామాల్లో ఉండి సర్వే చేపడుతున్నామని చెబుతున్నారు. రోజువారీ విధుల్లో పాల్గొంటూనే సర్వే చేపట్టడం అందులో సర్వర్, ఆన్‌లైన్ ఇబ్బందులతో, ఉద్యోగం అంటేనే భయమేస్తున్నదని ఆవేదన చెందుతున్నారు. అధికారులు తమ ఇబ్బందులను గుర్తించాలని కోరుతున్నారు.

**సర్వర్, నెట్‌వర్క్‌తో ఇబ్బందులు ..**



ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో యాప్ సర్వర్, నెట్ వర్క్ ఇబ్బందులతో సర్వే మందకొడిగా జరుగుతున్నది. కొన్ని సార్లు యాప్ సర్వర్ పని చేయడం లేదు. మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో నెట్‌వర్క్ ఇబ్బందులతో సర్వేకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

–తిరుపతి, గ్రామ కార్యదర్శి, పోచారం

**సిగ్నల్ కోసం వెతుక్కోవాల్సి వస్తున్నది..**



మండలంలోని మారుమూల గ్రామాలు, తండాల్లో యాప్ సర్వర్, నెట్ వర్క్ ఇబ్బందుల వల్ల సర్వే వేగంగా ముందుకు సాగడం లేదు. వారం రోజుల్లో కేవలం 30 శాతం మాత్రమే సర్వే పూర్తి చేశాం. సర్వే కోసం గ్రామంలో సిగ్నల్ కోసం వెతుక్కోవలిసి వస్తున్నది. విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

–ప్రభాకర్, ఎంపీడీవో, నాగిరెడ్డిపేట

## 9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

వినాయక్‌నగర్, డిసెంబర్ 22 : నిజామాబాద్ నగరంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో పేకాడుతున్న సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం సీసీఎస్ టీమ్ దాడి నిర్వహించింది. న్యాల్‌కల్ రోడ్డులోని ఆర్టీసీ–2 డిపో ఎదుట పేకాటస్థావరంపై దాడి చేశారు. 9 మంది జూదరులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.14,800 నగదును సీజ్ చేశారు. పట్టుబడిన వారిని సంబంధిత ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



సురేశ్ (ఫైల్)

మోర్తాడ్, డిసెంబర్ 22: దొన్కల్ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన ఒల్లెం సురేశ్(44) వ్యవసాయ క్షేత్రంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒల్లెం సురేశ్‌ను అదే గ్రామానికి చెందిన పెద్ద మల్లేశ్ అనే వ్యక్తి బైక్‌పై తన వ్యవసాయక్షేత్రంలోకి తీసుకెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజు పోయిందని, దానిని బాగు చేయాలని చెప్పాడు. సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకున్నానని చెప్పడంతో సురేశ్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా అవుతుండడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తన వెంట తీసుకెళ్లిన సదరు వ్యక్తి నిర్లక్ష్యం కారణంగానే సురేశ్ చనిపోయాడని, అతనిపై కేసు నమోదు చేయడంతోపాటు మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని, అప్పటి వరకు పోస్టుమార్టం చేయవద్దని బంధువులు పట్టుబట్టారు. దీంతో పోస్టుమార్టం చేయడాన్ని సోమవారానికి వాయిదా వేసినట్లు తెలిసింది. ఈవిషయంపై ఎస్సై విక్రమ్‌ను వివరణ కోరగా.. ఇంకా కేసు నమోదు కాలేదని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

## ప్రభుత్వ న్యాయవాదుల నియామకం



గౌసుద్దీన్



మాధవీలత



రవీందర్

బోధన్, డిసెంబర్ 22: బోధన్ పట్టణంలోని న్యాయస్థానాలకు ప్రభుత్వ న్యాయవాదుల నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాల కార్యదర్శి ఆర్. తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఐదో అదనపు జిల్లా జడ్జి న్యాయస్థానంలో అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా మహ్మద్ గౌసుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానాలకు బొగ్గుల రవీందర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బోధన్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా బోనాల మాధవీలతను నియమించారు. తమకు కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వహిస్తూ తమవంతు సేవలు అందిస్తామని వారు పేర్కొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మోర్తాడ్, డిసెంబర్ 22: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో కృష్ణాగౌడ్‌కు రూ.60వేలు, లావణ్యకు రూ.32వేలు, సరస్వతికి రూ.15వేలు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరు కాగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి బాధితుల ఇంటికి వెళ్లి ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాషా, రాజేంద్రప్రసాద్, ప్రదీప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ఎత్తిపోతల పథకం నీటి విడుదల



స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

నందిపేట్, డిసెంబర్ 22: మండలంలోని ఉమ్మెడ శివారులోని అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకం నుంచి నీటిని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడారు. నేరుగా చెరువులను నింపుకొని తద్వారా సాగు భూములకు నీటిని వాడుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాయారెడ్డి, నాగ సురేశ్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి నందిపేట్ మండలానికి చెందిన లబ్ధిదారులకు మండల కేంద్రంలోని రైతువేదికలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, సాయికుమార్, నర్సాగౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనం



పోచంపాడ్ చౌరస్తా వద్ద మాట్లాడుతున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

రెంజల్/మెండోరా, డిసెంబర్ 22: అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమీత్ షా ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రెంజల్ మండల కేంద్రంలో ఆదివారం కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టి బొమ్మను మాల మహానాడు ఆధ్వర్యంలో దహనం చేశారు. మొదట కేంద్ర మంత్రి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద దహనం చేశారు. మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డైరీ సాయిలు, బొగిడి రవి, దేవరాజు, మదన్, ప్రసాద్,ప్రభాకర్, గైనిఆనంద్, గంగాధర్, నారాయణ, గైనికిరణ్ తదితరులు ఉన్నారు. మెండోరా మండలంలోని పోచంపాడ్ చౌరస్తా వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు నిరసన తెలిపారు. అనంతరం కేంద్ర మంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తలారి గంగాధర్, నాయకుడు బురుకల కమలాకర్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినికి మెడల్ బహూకరిస్తున్న అతిథులు

బోధన్, డిసెంబర్ 22: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని శ్రీ విజయసాయి హైస్కూల్‌లో గణితం క్విజ్ పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోధన్ ఎంఈవో నాగయ్య హాజరై మాట్లాడారు. శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని గణితశాస్త్రం అధ్యయనంలో రాణించాలని అన్నారు. ఈ సందర్భంగా తనకు గణితం బోధించిన గురువులను ఆయన స్మరించుకున్నారు. క్విజ్‌లో గెలుపొందిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో మెడల్స్‌ను బహూకరించారు. ఈ మెడల్స్‌ను లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి అధ్యక్షుడు రామకృష్ణ, ఆ క్లబ్ ప్రతినిధులు కేవీ సత్యనారాయణ (సత్యం), శ్రీనివాస్ రాజు విద్యార్థులకు అందజేశారు. పాఠశాలకు చెందిన తనుష్క, హర్షిణి అనే విద్యార్థినుల టీమ్‌లు ప్రథమ స్థానంలో నిలిచాయి. క్విజ్ కార్యక్రమాన్ని శ్రీ విజయసాయి హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

## ఇసుక టిప్పర్ సీజ్

రెంజల్, డిసెంబర్ 22: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై ఈ.సాయన్న ఆదివారం తెలిపారు. బోధన్ మండలం కొప్పర్గ వైపు నుంచి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను నీలా సమీపంలో శనివారం రాత్రి పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. చర్యల కోసం ఉన్నత అధికారులకు అప్పగించామని ఎస్సై చెప్పారు.

## నియామకం..

ఆర్మూర్‌టౌన్,డిసెంబర్22: పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో ఉన్న బాయ్స్ హైస్కూల్‌కు చెందిన హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య తెలంగాణ రాష్ట్ర గెజిటెట్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సంఘం బలపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.




*సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్.. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో కలిసి ఆదివారం కలిశారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో నవోదయ పాఠశాలల ఏర్పాటు కోసం స్థలాలను అందజేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఆయా జిల్లాల్లో పాఠశాలల ఏర్పాటుకు సుమారు 20 ఎకరాల చొప్పున భూమిని కేటాయించాలని పేర్కొన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులకు మాధవనగర్, మామిడిపల్లి ఆర్‌వోబీ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు. – వినాయక్‌నగర్, డిసెంబర్ 22*

# బేస్‌బాల్ పోటీల్లో జిల్లా మహిళా జట్టు విజయం

డిచ్‌పల్లి, డిసెంబర్ 22 : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ బేస్‌బాల్ ఫైనల్ పోటీల్లో నిజామాబాద్ మహిళల జట్టు విజయం సాధించింది. హైదరాబాద్ జట్టుపై 6–3 తేడాతో జిల్లా జట్టు గెలుపొందినట్లు డివైఎస్‌వో ముత్తెన్న, బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్‌కుమార్ తెలిపారు. గెలుపొందిన జట్టు, కోచ్ మేనేజర్లు ఆదివారం రాగా..

వారికి డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో బేస్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మార్కంటి గంగామోహన్, సాంఘిక సంక్షేమ పాఠశాల సుద్దపల్లి ప్రిన్సిపాల్ నళిని, జిల్లా సోషల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ నీరజారెడ్డి, పీఈటీ స్వప్న, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో క్రీడాకారులను అభినందిస్తున్న క్రీడా సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు

# ఆపన్నహస్తం కోసం ఎదురు చూపులు

- కిడ్నీలు పాడై మూడేండ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్న బాధితుడు
- రోడ్డున పడిన భార్యా పిల్లలు



భార్యా పిల్లలతో మహ్మద్ రఫీ

నవీపేట, డిసెంబర్3: మండలంలోని సిరన్‌పల్లి గ్రామానికి చెందిన 39 ఏండ్ల వయస్సు గల మహ్మద్ రఫీ రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యి బాధపడుతున్నాడు. కుటుంబ పెద్ద ఐదేండ్లుగా మంచానికి పరిమితం కావడంతో కుటుంబం రోడ్డునపడింది. ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నది. రఫీకి భార్య ఆజ్మీరా బేగం, ఇద్దరు కూతుర్లు రిధా మహేన్(6), రిఫా మన్‌హా(4) ఉన్నారు. గతంలో బాధితుడు ఉపాధి నిమిత్తం సౌదీకి వెళ్లాడు. కరోనా వైరస్ బారిన పడి మందులు వాడాడు. వ్యాధి తగ్గు ముఖం పట్టిన తర్వాత 2020 డిసెంబర్‌లో స్వదేశానికి తిరిగి వచ్చాడు. ఆరు నెలల తర్వాత మళ్లీ తిరిగి గల్ఫ్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. మెడికల్ రిపోర్టులో రెండు కిడ్నీల్ ఫెయిల్ అయినట్లు తేలింది. కిడ్నీలు పాడుకావడంతో మూడేండ్లుగా డయాలసిస్ చేయించుకుంటూ నరక యాతన అనుభవిస్తున్నాడు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా డయాలసిస్ చేస్తున్నప్పటికీ మందులు ఇతర ఖర్చులకు నెలకు రూ. 10 వేల వరకు ఖర్చు అవుతాయని కిడ్నీ బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇంకో ఆరు నెలల వరకు కిడ్ని ప్లాంటేషన్ చేసుకోవాలని లేకపోతే జీవితం దుర్భరం అవుతుందని వైద్యులు పేర్కొంటున్నారని ఆ కుటుంబం చెబుతున్నది. కిడ్నీల ప్లాంటేషన్‌కు రూ. 25 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారని పేర్కొన్నారు. తనకు ఆస్తి పస్తులు లేవని, తాను బీడీలు చేస్తూ పిల్లలను పోషిస్తున్నానని, పిల్లల పోషణ భారంగా మారిందని బాధితుడి భార్య ఆజ్మీరా బేగం తెలిపారు. తన భర్తకు కిడ్నీల ప్లాంటేషన్ కోసం సహాయం చేసే దాతలు 8897842856 నంబర్‌కు డబ్బులు ఫోన్‌పే చేయాలని కోరింది.